

బ్యూటీ పార్లర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక ఆల్కాట్ గార్డెన్స్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థలో బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాంది. 30 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులకు మాత్రమేనని, 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి, తెల్ల రేషన్ కార్డ్ కలిగి, కనీసం 8వ తరగతి చదివిన వారై ఉండాలని ఆయన తెలిపారు. వివరాల కోసం దిగువ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. 0883-2420242, 2428807, 9440414910, 9666832144

కౌలు రైతు కష్టాలు తీరేనా..?


- నూతన ప్రభుత్వంపై ఆశ
- అత్యధిక సాగుదారులున్నా ఆదరణ కరువు
- అందని ద్రాక్షలా ప్రభుత్వ సబ్సిడీలు, రుణాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామాల్లో కౌలు చేసుకుని సాగు చేస్తున్న కర్షకులు నష్టపోతున్నారు. వ్యవసాయ భూమి కలిగిన రైతులు మాత్రమే ప్రభుత్వ దృష్టిలో అన్నదాతలుగా పరిగణించబడటమే ఈ దుస్థితికి కారణం. అయితే ప్రభుత్వం అందించే ఎలాంటి పథకాలు వర్తించకున్నా, సబ్సిడీలు, ఉచిత పథకాలు, పంట నష్టపోతే నష్టపరిహారం రాకున్నా వ్యవసాయమే జీవనాధారంగా శ్రమ చేస్తున్నారు. ఈ కౌలురైతుల్లో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ 2 లక్షలకు పైగా సాగు జరుగుతోంది. సుమారు లక్షకుపైగా కౌలు రైతులు ఉన్నారని అంచనా. సగం వరకు లెక్కల్లో లేని విధంగా కౌలు రైతులు ఉన్నారని గ్రామాల్లో ఉండే కర్షకుల అంచనా. కౌలు రైతులు గ్రామాల్లో రెండు రకాలుగా ఉన్నారు. పూర్తిస్థాయిలో భూమి లేనివారు ఇతర వ్యక్తుల నుంచి భూమి తీసుకుని సాగు చేస్తున్నారు. అత్యధిక మంది భూ యజమాని నుంచి కౌలునామా పత్రం సైతం రాసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇదే తరహాలో మరో కౌలు రైతులు కూడా ఉన్నారు. వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకుని ఉండే రైతులు తమకున్న ఎకరం, రెండెకరాలతో పాటు తమ సామర్థ్యానికి అనుగుణంగా తమ పక్కన ఉన్న భూములనో, లేదా ఇతర చోట్ల ఉన్న భూములనో కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇలాంటి చిన్నసన్న కారు రైతులు కౌలుకు తీసుకుని చేసే పద్ధతి జిల్లాలో ఎక్కువ శాతంలో ఉంటుంది. నూతన ప్రభుత్వమైనా ప్రభుత్వ నిబంధనలను సడలించి కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు అందించేలా చర్యలు చేపట్టాలి.

కౌలు ధరలు పైపైకి

ఎకరా భూమికి రైతులు చెల్లించే కౌలు రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. నీరు సమృద్ధిగా ఉండి, అనుకూలమైన విధంగా భూమి ఉంటే కౌలు చెల్లించే డబ్బులు అధిక మొత్తంలో చెల్లించక తప్పడం లేదు. కొంతమంది రైతులు మాత్రమే కౌలునామా రాసుకుంటుండగా మరికొంత మంది మాటపూర్వకంగా వారికున్న సత్సంబంధాలతో కౌలుకు చేస్తున్నారు. అయితే కొంతమంది భూ యజమానులు నగదు కాకుండా పండిన పంటలో ఎకరానికి 6 నుంచి 14 బస్తాల చొప్పున తీసుకుంటున్నారు. ఎకరం వరి పంట సాగుచేయ్యేందుకు కావాల్సిన మొత్తం ఖర్చు సుమారుగా రూ.36 వేలు. ఇవికాక, మార్కెట్‌కు వెళ్లిన తర్వాత హమాలీ ఛార్జీలు, వర్షం కురిస్తే పరదాల కిరాయిలు, వర్షానికి తడిసి నీటిపాలయ్యే ధాన్యం ఇవేమి యజమానికి సంబంధం లేదు. ఎకరానికి వచ్చే దిగుబడి సగటున 32 బస్తాలు. ఒక బస్తా బరువు 70 కేజీలు ఉంటే ఎకరానికి 32 బస్తాలైతే 22.40 క్వింటాళ్లు. 36 బస్తాలైతే 25.20 క్వింటాళ్లు. అంటే ఎకరానికి ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.2040 అందిస్తోంది. ఎకరానికి రూ.50 వేల వరకు రైతుకు నగదు రూపంలో అందుతోంది. అందులో రైతు కౌలుకొచ్చే భూ యజమానికి ఇవ్వగా మిగిలేది కూలి కూడా కష్టమేనని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితులలో అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా తట్టుకుని సాగు చేసినా చివరకు నష్టాలు మిగులుతున్నాయి.



గుర్తింపు కార్డులేవి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ యజమానుల నుంచి కౌలునామా పత్రాలు రాసిచ్చి అంగీకారం తెలిపితే గుర్తింపు (సిసిఆర్‌సి) కార్డులు ఇస్తున్నారు. కొంతమంది రైతులు నిరాకరించడంతో కౌలునామా పత్రాలు కనుమరుగయ్యాయి. నిబంధనల ప్రకారం కౌలు రైతులను గుర్తించి, వారికి రుణ అర్హత కార్డులు అందచేసి, బ్యాంకు రుణాలు కూడా ఇవ్వాలి. కానీ, వీటిపై రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎలాంటి దయ చూపడం లేదు. దీంతో ఎలాంటి సహకారానికి నోచుకోవడం లేదు. కౌలు రైతులకు ఇతర రంగాల్లో ప్రావీణ్యం లేకపోవడంతో లాభనష్టాలతో సంబంధం లేకుండా కౌలు చెల్లించి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. కౌలు రైతులకు ఎక్కడా అధికారిక గుర్తింపు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వీరు అనర్హులుగా మిగిలిపోతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పథకాలను సైతం అత్యధిక మంది పొందలేకపోయారు. ఇక కనీసం బ్యాంకు నుంచి రుణాలు పొందాలనుకున్నా పొందలేని పరిస్థితిలో కౌలు రైతులు ఉన్నారు. వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకుని వ్యవసాయం చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం అందించే అన్ని రకాల సాయం అందేలా చూడాలని కౌలురైతులు కోరుతున్నారు.

అర్హులందరికీ గుర్తింపు కార్డులు

జిల్లాలో అర్హులైన కౌలు రైతులు అందరినీ గుర్తించి సిసిఆర్‌సి కార్డులు అందజేస్తున్నాము. గత ఏడాది అందజేసిన అర్హులందరి కార్డులను ఈ ఏడాది రెన్యువల్ ప్రక్రియ ప్రారంభించాము. భూ యజమానులను, కౌలు రైతులను సమావేశ పరిచి అవగాహనకల్పించి అనుమతి పత్రాలు అందజేయాలని సూచిస్తున్నాము.

- ఎస్.మాధవరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి.

ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న బుచ్చయ్యచౌదరి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు టిడిపి సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయనతో గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గోరంట్లకు ఫోన్ చేశారు. ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాలని కోరారు. దీనికి గోరంట్ల సమ్మతించారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగారు. ఇప్పటి వరకూ పదిసార్లు ఎంఎల్ఎగా పోటీ చేసి ఏడు పర్యాయాలు విజయం సాధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తర్వాత ఏడు సార్లు ఎంఎల్ఎగా గెలుపొందింది గోరంట్ల మాత్రమే. ఈ నెల 21 నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లతో పాటూ నూతన మంత్రులు, ఎంఎల్ఎలతో గోరంట్ల ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక జరుగుతుంది. స్పీకర్‌గా ఇప్పటికే అయ్యన్నపాత్రుడు పేరు ఖరారైన విషయం విదితమే.



పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా సంస్థ చైర్మన్ గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశబాబు స్థానిక డిఎల్ఎస్ఎ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం తూర్పు గోదావరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 29న జాతీయ లోక్ అదాలత్‌లో నిర్వహించే ఈ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులను పెద్దఎత్తున పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అదనపు జిల్లా కోర్టుల్లో మోటారు వాహన ప్రమాద కేసులను పరిష్కరించి బాధితులకు పరిహారం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇవే కాకుండా భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, రెవెన్యూ కేసులు, మున్సిపల్ కేసులు, ఇతర నెగోషబుల్ కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్‌పి పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్, అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

కేన్సర్ బాధితునికి సాయం

ప్రజాశక్తి-గోపాలపురం

గొంతు కేన్సర్‌తో బాధ పడుతున్న యువకునికి వైద్యం బుధవారం మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ గోపాలపురానికి చెందిన ఏలూరి ప్రసాద్ గొంతు కేన్సర్‌తో బాధ పడుతున్నట్లు తెలిపారు. గొంతు క్యాన్సర్ వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని, దీంతో ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆవ్యక్తికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు స్పందించారు. మానవత సంస్థ ద్వారా రూ.3000, మద్దిపాటి గంగరాజు రూ.2000, కో చైర్మన్ నెల్లి చంద్రశేఖర్ రూ.వెయ్యి, మొత్తం రూ.6000 ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రామచంద్రా రెడ్డి ఆశయాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అందరూ మానవత సంస్థలో సభ్యులుగా చేరి ప్రతి ఒక్కరూ చేతనైన సాయం చేయాలని కోరారు. తద్వారా ఆపదలో ఉన్న అండగా ఉండాలన్నారు. మండలంలో మానవత ఆధ్వర్యంలో ఫ్రీజర్లు, శాంతి రథాలు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసి మెంబర్ కుక్కల కీర్తి కుమార్, సభ్యులు మడిచర్ల గోపి, నరసింహమూర్తి, ఉంగుటూరు ప్రసాద్, కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎనీమియా నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో సికిల్ సెల్ ఎనీయమియా నిర్మూలన దినోత్సవం బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది అంటువ్యాధి కాదని జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని తెలిపారు. 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించే మిషన్ ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాధి ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో జీరో నుండి 45 ఏళ్ల మధ్య వయస్సున్న జనాభాకు అవగాహన కల్పించడం సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ ద్వారా ఈ వ్యాధిని అరికట్టడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహం అని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా మారతాయని తెలిపారు. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో హిమోగ్లోబిన్ కొడవలి కణాలుగా మారి తద్వారా ఏ భాగంలోనైనా కణజాలం, అవయవ వైకల్యానికి దారితీస్తుందని తెలిపారు. కొడవలి ఆకారంలో కణాలు మారడం వలన రక్తహీనత పరిస్థితులకు దారి తీస్తుందని జన్యుల లోపం వల్ల దీన్ని సికిల్ సెల్ ఎనీమియా అనే పిలవబడే తీవ్రమైన వ్యాధికి దారితీస్తున్నారు. ఈ కార్యక్రమంలో కెఎన్.జ్యోతి జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిన వారిలో రక్తహీనత కళ్లు పసుపు రంగులోకి మారడం తీవ్రమైన ఒళ్లు నొప్పులు కలిగి ఉండడం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అలసట తరచుగా వచ్చే అంటూ వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు అవయవ నష్టం అనగా వైకల్యం కలగవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్ రెడ్డి జిల్లా ప్రోగ్రాం మేనేజర్, డిపిఎంయు మాట్లాడుతూ ఇది చాలామంది పిల్లల్లో పెద్దల్లో కలిగే వీలు ఉంటుందని వీపు, కాళ్లు, చాతి మొదలైన వాటిలో తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయని తెలిపారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల విరోచనాలు, జ్వరం, ఇన్ఫెక్షన్, ఒత్తిడి అలసట మొదలైనవి నొప్పి సంక్షోభాన్ని ప్రేరేపిస్తాయని దీనివల్ల శ్వాస ఆడకపోవడం, వికారంగా ఉండడం, అవయవ వైఫల్యం వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలియజేశారు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇది అత్యవసర పరిస్థితిగా గుర్తించి వెంటనే వైద్యుని సంప్రదించాలని తెలిపారు. ఎపిడమాలజిస్ట్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాలు వచ్చినప్పుడు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తరచూ నీళ్లు తాగుతూ ఉండాలని, సమతులాహారం, పౌష్టికాహారం తీసుకోవాలని విపరీతమైన వాతావరణ పరిస్థితిలకు ఎదురు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పాటు చేసుకోవాలని ఎత్తైన ప్రదేశాలకు వెళ్లకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.సీత, డిప్యూటీ వార్డెన్ బి.కర్రమ్మ, పీడీ జి.చిన్నారావు, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

ఎన్నికల మీడియా స్క్రీనింగ్‌కు విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇటీవల ఎన్నికల సమయంలో జిల్లా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు స్క్రీనింగ్‌కు కీలమైన మద్దతు అందించారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ భాస్కర్ మణికంఠ, కృష్ణ, విభాగాధిపతి డాక్టర సునీల్ కుమార్ దువ్వూరితో పాటు సోషల్ మీడియా స్క్రీనింగ్‌కు కీలకమైన మద్దతు అందించారు. వారి విలువైన సేవలకు రూ.30 వేల గౌరవ వేతనాన్ని కలెక్టరేట్ మంజూరు చేశారు. ఎన్నికల ప్రక్రియలో విలువైన అనుభవాన్ని పొందామని విద్యార్థులు సంతప్తిని వ్యక్తం చేశారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కె విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానాచార్యులు రామచంద్ర ఆర్‌కె

కుట్టు, మగ్గంలో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న టైలరింగ్, మగ్గం కోర్సులలో ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల. రాంబాబు తెలిపారు. ఈ కోర్సులలో శిక్షణకు కనీసం 10వ తరగతి లేదా చదవగలిగే వారికి అవకాశం ఉంటుందన్నారు. జూన్ నెల 24 సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు 45 రోజులపాటు జరిగే ఈ ఉచిత శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతోపాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని రాంబాబు తెలిపారు. కోర్సులో చేరేవారు ఫోన్ 9849847489, 9490710850 నెంబర్లను సంప్రదించాలని, లేదా స్వయంగా సంప్రదించాలనుకునే అభ్యర్థులు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరుపై హర్షం

ప్రజాశక్తి-నిడదవోలు

జగనన్న విదేశీ విద్య పేరును మార్చి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి (ఎఒవిఎన్) పేరును కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేయటం పట్ల కెవిపిఎస్ తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. రాంబాబు మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్యా పథకాన్ని పేరును మార్చి జగనన్న విదేశీ విదేశీ పథకంగా పేరు మార్చుకున్న సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు తెలిపామన్నారు. జగన్మోహన్ రెడ్డి అహంకారంతో భారత రాజ్యాంగ నిర్మాత అని కూడా చూడకుండా అంబేద్కర్ పేరును మార్చి ప్రజల్ని. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని రాంబాబు విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల్ని పక్కనపెట్టి దళితులకి ఎస్‌టిలకు ఉన్న పథకాలన్నీ రద్దు చేసి దళితులు అభివద్ధి కాకుండా అడ్డుకున్నారని దానికి తగిన మూల్యం చెల్లించుకున్నారని రాంబాబు విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు రూ.వేలాది కోట్లను నవరత్నాలకు మళ్లించి ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి దళితుల అభివద్ధిని అడ్డుకున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం అయినా సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా దళితులకే ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరసాల కృష్ణ పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న రాంబాబు



వ్యవస్థలో మార్పు రావాలి : ఎంఎల్ఎ గోరంట్ల

ప్రజాశక్తి-కడియం

మన బిడ్డల భవిష్యత్తు కోసం వ్యవస్థలో మార్పు రావాలని, ఇప్పటివరకు రాక్షస పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని, ప్రతి ఒక్క అధికారీ ప్రజా క్షేత్రంలో ఉండాలని, రాబోయే పుష్కరాల నాటికి సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, బుధవారం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ గోరంట్ల మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో ప్రజలు అభివద్ధి లేక నరకయాతన పడ్డారని, కేంద్రం నిధులతో ఇంటింటికి మంచినీళ్లు అందించాలని ప్రారంభించిన జల మిషన్, గత ప్రభుత్వంలోని నాయకుల వల్ల పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోయారని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు ఎన్ని అసంపూర్తిగా ఉన్నాయో, ప్రస్తుతం ఎంతమంది గృహాలు నిర్మించుకుంటున్నారో పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల పేరుతో గృహాలు నిర్మించుకోలేని ప్రాంతాల్లో స్థల సేకరణ చేసి, గృహ లబ్ధిదారులకు అందజేస్తే వారు ఏ విధంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటారని దుయ్యబట్టారు. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే 14, 15 ఆర్థిక సంఘం నిధులు పక్కదోవ పట్టించి, పంచాయతీలు అభివద్ధికి నోచుకోకుండా చేసిన ఘనత జగన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బ్లీచింగ్ కొనుగోలుకు, కరెంటు బిల్లు కట్టుకునేందుకు కూడా లేకుండా గ్రామ పంచాయతీల ఖజానా ఖాళీ చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇక నుంచి ఏ శాఖ పైనైనా ఫిర్యాదు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి,రాజ్ మనోజ్, సిఐ బి తులసీధర్, సర్పంచులు అన్నందేవుల చంటి, పాటంశెట్టి రాంజీ, చెక్కపల్లి మురళీకృష్ణ, పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి

ఎంఎల్ఎ జ్యోతులకు పలువురి అభినందన

ప్రజాశక్తి- గోకవరం

జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూని బుధవారం ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు జ్యోతుల నెహ్రూ విజయానికి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పాలూరి బోసు బాబు ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు నాయకులు మద్దతు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను నూతన ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశతో ఉన్నామని పలువురు విశ్రాంత ఉద్యోగులు అన్నారు. తాళ్లపూడి మండల విశ్రాంత ఉద్యోగుల సమావేశం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్రాభివద్ధిలో నూతన ప్రభుత్వానికి రిటైర్డ్ ఉద్యోగులు అందరూ సహకరిస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు మారిశెట్టి నాగేశ్వరరావు కార్యదర్శి, వి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - నిడదవోలు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిన్నం మురళీకష్ణ అధ్యక్షతన బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ సెంటర్ వద్ద పలువురు పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నం మురళీకష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యం అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి టిడ్కో గృహాలను నిర్మించారని, వాటిని గత ప్రభుత్వం విస్మరించడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటిని గత ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే వాటికి మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ హీరాలాల్, భావన రమేష్, హుస్సేన్ జహా, పడాల అచ్యుత, పులుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ మృతి

ప్రజాశక్తి- గోకవరం

ఉపాధి హామీ పనికి వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన రంపఎర్రంపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన కర్ణం వెంకటేశులు (50) నరసింహ చెరువులో ఉపాధి హామీ పనికి వెళ్లి ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్, తోటి పనివారు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశులు మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు చెప్ప డంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వెంక టేశులు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలని నోటీసు

ప్రజాశక్తి - గండేపల్లి

ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వం భూమిని అక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని పంచాయతీ కార్యదర్శి బివిఎన్.రెడ్డి సంబంధిత అక్రమణదారుడికి నోటీసు అందించారు. గండేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 148లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అనధికారికంగా దువ్వూరి శేషగిరి అనే వ్యక్తి నిర్మాణాన్ని చేపట్టినట్లు వచ్చిన ఫిర్యాదుపై పంచాయతీ కార్యదర్శి తక్షణమే నిర్మాణాన్ని తొలగించాలని నోటీసు జారీ చేశారు. అయితే ఆక్రమణదారుడు ఆ నోటీసు అందుకునేందుకు నిరాకరించాడు. దీంతో సంబంధిత నోటీసును నిర్మాణం జరుగుతున్న గోడకు అంటించినట్లు కార్యదర్శి తెలిపారు. 15 రోజుల్లోగా నిర్మాణాన్ని తొలగించకపోతే చట్ట ప్రకారం నిర్మాణాన్ని తొలగిస్తామని ఆ నోటీసులో కార్యదర్శి వెల్లడించారు.

హితకారిణి సమాజం భూముల వేలం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఉప్పంగల పంచాయతీలో హితకారిణి సమాజంకు చెందిన వ్యవసాయ భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. సర్వే నెంబర్ 93/3లోని 4.30 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా నలుగురు వ్యక్తులు దరావత్ చెల్లించి వేలంపాటకు హాజరయ్యారు. రైతు మట్టపర్తి గోవింద్ రూ.1.02 లక్షలకు 3 ఏళ్ల కాలానికి వేలం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాఖ శంకరుడు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధా, ఇఒలు సోమరాజు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వం ద్వారా అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం గ్రూప్ ఆధ్వర్యంలో మాతృత్వం కార్యక్రమం ద్వారా పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, వృద్ధులకు బుధవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం గ్రూపు సభ్యుడు పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్న పెద్దాపురం వాసి సామ్యూల్ ఆర్థిక సాయంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ వినోద్, పర్ ద పీపుల్ సంస్థ ఛైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధి కోసం కార్యాచరణ : వనమాడి

ప్రజాశక్తి - కాకినాడ


డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

గడచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో గాడి తప్పిన కాకినాడ నగర అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. బుధ వారం కాకినాడ మున్సిపల్ కార్పొ రేషన్ కమిషనర్ ఇతర అధికారులతో కలిసి ఆయన సంజీవ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భం గా కొండబాబు మాట్లాడుతూ జన నివాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో నగరానికి దూరంగా ఎన్ఎఫ్‌సిఎల్ సంస్థకు చెందిన 20 ఎకరాల భూమిని సేకరించి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ రూపకల్పనకు ప్రతిపాదనలు చేశామని, అయితే మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తన అక్రమ సంపాదనకు జననివాసాల మధ్య ఉన్న సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిం చడానికి అనువైన ప్రాంతంగా ఎంచుకుని అక్కడ జనసంచారం లేకుండా చేయడం కోసం కేవలం కిలోమీటర్ మేర రోడ్డు వేయకుండా నియంత్రిం చాడన్నారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో లారీలు ఎగుమతి, దిగుమతులకు సంబంధించి ఎక్కువ భాగం కార్యకలాపాలు సాగిస్తుండటం మూలంగా ఈ రోడ్డును డంపింగ్ యార్డ్ నుంచి కాకినాడ పాత రైల్వే స్టేషన్ వరకు తక్షణం పునరుద్ధరించే ప్రయత్నంలో నేడు మున్సిపల్ అధికారులను కోరడం జరిగిందని తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలు నివసించే ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ మూలంగా అనేక ఇబ్బందులు పడుతూ అనారోగ్యాల పాల్పడుతున్నారని అన్నారు. వారి సమస్యను పరిష్కరించేందుకే సంజీవ్ నగర్ నుంచి డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి తరలించే విధంగా కార్యా చరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ నగరంలో గంజాయి, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పోలీసు ఇతర యంత్రాంగంతో నిరంతర నిఘా వ్యవస్థ రూపొందించడం జరిగింద న్నారు. ఎంఎల్ఎ సూచనల మేరకు సర్పవరం నుంచి పాత పోర్టు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును యుద్ధ ప్రాతిపదికపైన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. పోర్ట్ సిఐ సుమంత్ మాట్లాడుతూ కాకినాడ నగరంలో గంజాయి నిర్మూలనకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ అధికారులు, టిడిపి సిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి బాలాజీ, గదుల సాయిబాబా, సంగిశెట్టి అశోక్, లారీ యూనియన్ నాయకులు అల్లం రాజు, దాసరి శ్రీనివాసరావు, ముత్యం, ఏలిపే శ్రీనివాస్, అడిగర్ల గంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 24 మందికి ప్రవేశాలు

ప్రజాశక్తి - సామర్లకోట

5 సంవత్సరాల నిండిన 24 మందిని నేను బడికి పోతా కార్యక్రమంలో బడిలో చేర్పించినట్లు సామర్లకోట ఎంఇఒ-1 శివరామకృష్ణయ్య తెలిపారు. బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద బ్రహ్మదేవం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో ఎంఇఒ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. సమావేశం అనంతరం పాఠశాల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల వివరాలు సేకరించి పాఠశాలలో నమోదు చేయించారు. పాఠశాల పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు సుమారు 24 మంది ఉండగా 24 మందిని పాఠశాలలో నమోదు చేయించడం జరిగిందని ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చినరాజప్పను కలిసిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం


చినరాజప్పను కలిసిన వైద్య సిబ్బంది

పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను కాండ్రకోట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్ర కిరణ్‌బాబు, డాక్టర్ ఉషాప్రియదర్శిని, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సేవలు, వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన శిబిరాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈనెల 19 నుంచి ప్రారంభమై జూలై 3వ తేదీ వరకు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ ద్వారా నిర్వహించే ఆరోగ్య శిబిరాల గురించి వివరించారు. అలాగే సీజనల్ వ్యాధుల నిర్మూలన, ప్రజలకు అవగాహనపై చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్మోహన్, సిహెచ్ఒ రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్‌సిసి క్యాడెట్లకు సూచనలిస్తున్న ఎయిర్ కమాండర్ రెడ్డి

ఎన్‌సిసి ద్వారా మెరుగైన భవిష్యత్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్‌సిసి ద్వారా దేశభక్తి, క్రమశిక్షణతో కూడిన మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని ఎపి, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ఎన్‌సిసి డిజిపి, ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయంలో ఉభయ రాష్ట్రాలకు సంబంధించి ఎంపికైన ఎన్‌సిసి క్యాడెట్లకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లకు మంచి భవిష్యత్తు కోసం ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ శిక్షణను క్యాడెట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలై 2 నుంచి 24 వ తేదీ వరకు తిరుచురాపల్లిలో జరిగే జాతీయస్థాయి ఐడిఎస్ఎస్ - 2024 షూటింగ్ ఈవెంట్లలో పాల్గొనే ఎన్‌సిసి క్యాడెట్లందరూ అన్ని ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ద్వారా తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రతి బుధవారం టెస్టుల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందచేశారు. బుధవారం కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పన్ భోజన క్యారేజీ పథకంలో భాగంగా 536వ రోజు దాత ఉంగరాల విజయ ప్రోత్సాహంతో భోజన క్యారేజీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, సామా భగవాన్, సూర్యనారాయణరాజు, వెంకటరమణ, పొన్నాడ పేరయ్య రాజు, ధూళిపూడి బాబి తదితరులు పాల్గొన్నారు.

నానాజీ సొంత నిధులతో కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి - కరప


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నానాజీ తనయుడు సందీప్

మండలంలోని పెనుగుదురు కెఎంజి కెనాల్ పాతర్లగడ్డ కర్రవంతెన, గొర్రిపూడి, కరపలో వెంకటప్పయ్య మురికి కాలువలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ తన సొంత ఖర్చులతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. రైతులు తొలకరి పంట పండించుకునేందుకు నారుమడులు చేసుకునేందుకు సాగునీరు సక్రమంగా పొలాలకు అందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైతుల చేసిన విజ్ఞప్తి మేరకు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. నిధుల లేమి కారణంగా పనులు చేపట్టలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యం లోనే ఆయన సంబంధిత పనులకు అయ్యే ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో బుధవారం ఎంఎల్ఎ తనయుడు పంతం సందీప్ అధికారులతో కలిసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ఎంఎల్ఎ నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, రెడ్డిపల్లి భాస్కర్, తుమ్మలపల్లి మాచర్రావు, బండారు మురళి, గంట మల్లేశ్వర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత : చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట


అభిమానుల మధ్య కేక్‌ను కట్ చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నియోజకవర్గంలో నిలిచి పోయిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తానని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 28వ వార్డులో టిడిపి పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూకాలమ్మ ఆలయం వద్ద వార్డు ప్రజల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కాపు కళ్యాణమండపం, స్టేషన్ సెంటర్ లోని గడియార స్తంభం, పెద్దాపురం శతబ్ది పార్కు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుం దని అన్నారు. సకాలంలో వాటిని పూర్తి చేసి ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మహిళలకు ప్రధానంగా డ్వాక్రా ద్వారా ఎటువంటి పథకాలు అందించాలనే విష యంపై సిఎం చంద్రబాబుతో ఆలోచిస్తున్నట్టు చెప్పారు. సామర్లకోటలో తమ పాలనలో అందించిన టిడ్కో గృహాలకు మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు త్వరలో అందిస్తామని చెప్పారు నియోజకవర్గంలో మూడోసారి అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమార స్వామి, రైతు సంఘం నాయకులు కంటే జగదీశ్ మోహన్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య సేవలే లక్ష్యం : కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ


డ్రెయినేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రావు

ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుధ్య విభాగాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. పారిశుధ్య పనులలో ఎలాంటి అలస త్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. బుధ వారం ఆయన గాంధీనగర్ రైతుబజార్, వెంకట్ నగర్, సిద్ధార్థనగర్, శంతనపురికాలనీ, కొత్తపేట మార్కెట్, కొత్తకాకినాడ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు ప్రాంతాల్లోని కమ్యూనిటీ టాయ్‌లెట్స్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను ఆరా తీశారు. కొన్నిచోట్ల కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్వ హణలో లోపాలను గుర్తించి అవసరమైన సదుపా యలను కల్పించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కొన్నిచోట్ల అలసత్వాన్ని గుర్తిం చి సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు శానిటరీ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమ న్నారు. నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్ వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిలిచిన నాడు-నేడు పనులు

- పాఠశాలలు తెరిచినా పూర్తికాని పనులు
- నిధులు విడుదల్లో జాప్యం
- సిమెంట్, ఇసుక కొరత

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రయివేటు కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను హైస్కూళ్లను అభివృద్ధిపరిచి విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని సదుద్దేశంతో మొదలుపెట్టిన నాడు- నేడు అభివృద్ధి పనులు గత ఏడాదిగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అభివృద్ధి పనులకు రావాల్సిన నిధులు రావాల్సిన రివాల్వింగ్ ఫండ్ సక్రమంగా విడుదల కాకపోవడంతో చాలా పాఠశాలలు పనులు నిలిచిపోయాయి.

తెరుచుకున్న పాఠశాలలు

ప్రస్తుతం విద్యా సంవత్సరం 2024 స్కూళ్ళు తెరిచిన ఇంకా అభివృద్ధి పనులు మాత్రం పూర్తి కాలేదు. ఈలోగా వైసిపి ప్రభుత్వం ఓటమిపాలై కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చింది. అయితే కొత్త ప్రభుత్వ విధానం ఎలా ఉంటుందో అనేది అర్థం కాని ప్రశ్న..

రామచంద్రపురం మండలంలో..

వివరాలు పరిశీలిస్తే రామచంద్రపురం మండలంలో నాడు-నేడు అభివృద్ధి పనులు నిలిచిపోయిన పాఠశాలలు అడపావారి సావరం, రత్నంపేట, వేగాయమ్మ పేట, భీమ క్రాస్ పాలెం, సురన్న నగర్, కవలవారి సావరం, రామచంద్రపురం హైస్కూల్స్, ప్రాథమిక పాఠశాలలు. అదే విధంగా ద్రాక్షారామ జెడ్‌పి హైస్కూల్, హసన్‌బాద జెడ్‌పి హైస్కూల్, నరసరావుపేట హైస్కూల్ వెంకటయ్యపాలెం హైస్కూల్ అభివృద్ధి పనులు పూర్తికాకుండా నిలిచిపోయాయి.

కె.గంగవరం మండలంలో..

అదేవిధంగా కె.గంగవరం మండలంలోని కూళ్ళ, సత్యవాడ, కోటిపల్లి, కుందూరు, శివల, సుందరపల్లి, బట్లపాలిక, కె.గంగవరం హైస్కూలు, పామర్రు హైస్కూల్, అముజూరు స్కూల్లు నాడు నేడు అభివృద్ధి పనులు నేటికీ పూర్తికాలేదు.


బట్లపాలిక గ్రామంలో పునాదులకే పరిమితమైన నిర్మాణం

రివాల్వింగ్ ఫండ్ విడుదల కాకపోవడంతో..

నాడు-నేడు అభివృద్ధి పనుల్లో భాగంగా మైనర్, మేజర్ రిపేర్లు వంటగదులు టాయిలెట్లు, విద్యుత్ ఆధునికీకరణ వంటి పనులు చేయాల్సి ఉంది. అయితే కొన్నిచోట్ల 90 శాతం పనులు పూర్తి కాగా, కొన్నిచోట్ల 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఇక ఆయా పాఠశాలల అభివృద్ధి పనులకు రావలసిన రివాల్వింగ్ ఫండ్ సక్రమంగా విడుదల కాకపోవడంతో పాటు ఈ స్కూలుకు అవసరమైన సిమెంటు, ఇసుక కొరత వల్ల పనులు నిలిచిపోయాయి. అయితే ఈ ఏడాది విద్యా సంవత్సరం అయినా నాడు-నేడు అభివద్ధి పనులు పూర్తి చేసి విద్యార్థులకు వసతి సౌకర్యాలు మెరుగుపరచాలని, అసంపూర్తిగా అయిపోయిన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎప్పటికప్పుడు చోట్ల అభివద్ధి పనులు పూర్తి కాకపోవడంతో ఉపాధ్యాయులు రామాలయాల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వీలైనంతవరకు త్వరగా అభివద్ధి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏడాదిగా సిమెంట్ కొరత



నాడు-నేడు స్కూల్ అభివృద్ధి పనుల్లో ఏడాదికాలంగా సిమెంట్ విడుదల కాకపోవడంతో పనులు ఎక్కడికి అక్కడే నిలిచి పోయాయి. గత మార్చి వరకు రివాల్వింగ్ ఫండ్‌లో పనులు విడుదల య్యాయని అటు పిమ్మట నిధులు విడుదల కాలేదు. మరో 10 శాతం నిధులు విడుదలైతే మిగిలిన పనులు పూర్తవుతాయి. సిమెంటు ప్రభుత్వం వద్ద నుంచి ఇండెంట్ పెట్టి తీసుకోవలసి ఉంది. ఇసుక కూడా బయట కొనుగోలు చేయకూడదు. ఈ నిబంధనల ప్రకారం సిమెంటు, ఇసుక కొరత వల్ల ఏడాదిగా అదనపు గదుల నిర్మాణాలన్నీ నిలిచి పోయాయి. సిమెంట్ విడుదల అయితే చాలా వరకు పనులు ముందుకెళతాయి.

- ఎ.నాగరాజు, ఎంఇఒ, కె.గంగవరం

సిఎం, డిప్యూటీ సిఎంల చిత్రపటాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గోకవరం


చిత్రపటాల ఆవిష్కరణలో పాల్గొన్న కూటమి నాయకులు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా తంటికొండ గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో సెక్రెటరీ గన్ని రాజు ఆధ్వర్యంలో టిడిపి నేతలు, జనసేన నేతలు సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీరమయ్యాయని తెలిపారు. దొడ్డి దారిన పంచాయతీ నిధులను గత ప్రభుత్వం లాగేసుకోవడం వల్ల గ్రామ పంచాయతీలు అభివద్ధికి నోచుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తంటికొండ దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకృష్ణ, దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి బాబి, మలిరెడ్డి సిరి, నాగం వెంకటపతి, మిరియాల గాంధీ, తోట వీరబాబు, బదిరెడ్డి రవి, గెడ్డం బాబు, చింతల నాగు, గండిపూడి శ్రీధర్, బద్దిరెడ్డి నాగ సూర్య నత్యనారాయణ, ఎా లి శా టి వెంకటేశ్వరావు, వెలిశెట్టి వెంకన్న దొర పాల్గొన్నారు.

దేవాంగులకు ఎంఎల్‌సి ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్‌లో దేవాంగ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎంఎల్‌సి పదవిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ దేవాంగుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. దేవాంగులు రాష్ట్రంలో 15 లక్షలకు పైగా ఉన్నారన్నారు. గతంలో ఈ సామాజికి వర్గానికి చెందినవారు ఎంఎల్ఎలు, ఎంపీలు, మంత్రులుగా పనిచేశారన్నారు. ఇటీవల కాలంలో ఈ సామాజిక వర్గంపై ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపిలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కనీసం ఒక్క సీటైనా దేవాంగులకు కేటాయించలేదన్నారు. చందన నాగేశ్వర్‌ను వైసిపి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా ప్రకటించి, సీటు ఆయనకే కేటాయిస్తున్నట్లు వైసిపి అధినేత జగన్ తెలిపారన్నారు. చివరికి ఆయన్ని కాదని మంత్రి వేణుకు సీటును కట్టబెట్టారన్నారు.

కరపలో 'నేడు బడికి పోతా'

ప్రజాశక్తి - కరప

కరప శివారు పేపకాయలపాలెం గ్రామం లో నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంఇఒ-1 కెవి.కృష్ణ వేణి, ఎంఇఒ- 2 పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో 5 ఏళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్, మద్దూరి స్వామి, పేపకాయల రాజు అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిటర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేరాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించాలని, బ్యాంకింగ్ సేవలను తెలివిగా ఉపయోగించాలని తెలిపారు. జిల్లా లీడ్ డిస్టిక్ మేనేజర్ డివి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీల గురించి, డిపాజిట్ ఖాతాల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఈ వర్క్ షాప్ రిసోర్స్ పర్సన్స్ ఎన్.అనిల్, బి.సుమంత్, కె.చిట్టితల్లి మాట్లాడారు.

కె.సావరంలో పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కె.సావరంలో పంచాయతీ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. సర్పంచ్ నార్ని రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి కందుల దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను పెట్టారదు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యవర్గ సిబ్బంది, కార్యదర్శి ఎండీ హసన్ జానీ పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించాలని వీడియోగ్రాఫర్స్ ఆందోళన

ప్రజాశక్తి-గోపాలపురం

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పనిచేసిన ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు రావలసిన డబ్బులు ఇప్పించాలని ఫోటోగ్రాఫర్ల యూనియన్ సభ్యులు కోరారు. బుధవారం ఫోటోగ్రాఫర్ల యూనియన్ నాయకులు గోపాలపురం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజుకు పుష్పగుచ్చం ఇచ్చి సాలువాతో సత్కరించారు. యూనియన్ అధ్యక్షులు సిర్రా సూర్య, గూడూరు సుబ్రమణ్యం, ఏనుగుల బాలకష్ణ, కె.చంద్రరావు, ఎస్.కిషోర్, పూర్ణ, కె.రామకృష్ణ, మణికంఠ చారి, సాయికుమార్, త్రినాథ్, సాయి శ్రీనివాస్, వెంకీ, కిషోర్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అనపర్తి ఎంఎల్ఎ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి కలెక్టర్ డాక్టర్ మాధవీలతను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనపర్తి నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సి ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. కెనాల్ రహదారి మార్గం తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించడం జరిగింది.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి